రైతులపై టార్పాలిన్ల భారం

- రోజుల తరబడి కల్లాల్లోనే వరిధాన్యం
- కొనుగోళ్లు ఆలస్యం కావడమే కారణం
- నెల రోజులకు పైగా టార్పాలిన్లకు కిరాయి చెల్లించాల్సిన వైనం



కిరాయిల భారం తట్టుకోలేక వడ్లు ఆరబోసేందుకు పరిచిన చీరలు



బీబీపేటలో టార్పాలిన్ కవర్లలో వడ్లను ఆరబోసిన రైతులు

బీబీపేట: ఆరుగాలం శ్రమించి కష్టపడి పండించిన పంటను కాపాడుకోవడానికి రైతులు పడే కష్టం అంతా ఇంతా కాదు. సమయానికి వడ్లు కొనుగోలు కాకపోవడంతో కొనుగోలు కేంద్రాల వద్దనే నెలల తరబడి వేచిచూడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. నెల రోజులుగా కల్లాల్లోనే వడ్లు ఉండడంతో టార్పాలిన్ల కిరాయిలు రైతులకు పెనుభారంగా మారాయి. రూ.వేలల్లో కేవలం టార్పాలిన్ కవర్లకు చెల్లించడం ద్వారా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. గతంలో వ్యవసాయ సహకార సంఘం నుంచి ప్రతి రైతుకు సబ్సిడీ ద్వారా టార్పాలిన్ కవర్లు అందజేసేవారు. కానీ కొన్నేళ్లుగా ప్రభుత్వం నుంచి టార్పాలిన్ కవర్లు సరఫరా కాకపోవడంతో రైతులు కిరాయిలకు తెచ్చుకొని రూ.వేలకు వేలు నష్టపోతున్నారు.

ఒక్కో టార్పాలిన్ కవర్ కిరాయి రూ.25 పైనే

రైతులు వరి కోసి కొనుగోలు కేంద్రాలకు తరలించినప్పటి నుంచి వడ్లను ఆరబోయడానికి, వడ్లపై కప్పి ఉంచడానికి టార్పాలిన్ కవర్లను వాడుతారు. వాటిని ఆయా గ్రామాల్లో ఉన్న కొందరి వ్యక్తుల వద్ద కిరాయిలకు తెచ్చుకుంటున్నారు. ఒక్కో టార్పాలిన్ కవర్ కిరాయి ఒకరోజుకు రూ.25 ఉంటుంది. ఎకరానికి 5 టార్పాలిన్ కవర్ల అవసరం ఉంటుంది. దీంతో ఒక రైతు ఒక రోజుకు రూ.125 భారంగా మోస్తున్నాడు. ఇదే విధంగా ఒక్కో రైతు వడ్ల కొనుగోలు కేంద్రాల వద్ద ఇప్పటికే 20 నుంచి 30 రోజులు కల్లాల్లోనే వడ్లను ఉంచారు. దీంతో ఒక్కో రైతుపై 30 రోజులకు గానూ ఎకరం వడ్లు ఆరబోయడానికి రూ. 3750 భారంగా పడుతోంది. ఈ టార్పాలిన్‌ల కిరాయిలు చెల్లించలేక నానా అవస్థలు పడాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.

ప్రభుత్వం నుంచి అందని టార్పాలిన్ కవర్లు

కొన్నేళ్ల క్రితం ప్రభుత్వ హయాంలో వ్యవసాయ శాఖకు టార్పాలిన్ కవర్లు అందజేసి రైతులకు సబ్సిడీలో ఇచ్చేవారు. ప్రతి రైతు వాటిని కొనుగోలు చేసి సబ్సిడీ పొందేవారు. కానీ ప్రస్తుతం ప్రభుత్వం నుంచి టార్పాలిన్ కవర్లు ఇవ్వడం లేదు. ప్రతి సీజన్‌లో రైతులు సబ్సిడీలో టార్పాలిన్ కవర్లు వస్తాయేమో అని వ్యవసాయ శాఖ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కానీ ఇప్పటివరకు రాకపోవడంతో రైతులు టార్పాలిన్‌ల కిరాయిలు చెల్లిస్తూ మరింత భారం మోయాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు.

మూడు క్వింటాళ్ల పైసలు టార్పాలిన్ కవర్లకే..



నాకున్న మూడెకరాల్లో వరి పంట సాగు చేశాను. వరి పంట కోసి వడ్ల కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి పది రోజులు గడిచింది. దీంతో రోజు మూడెకరాలకు 12 టార్పాలిన్ కవర్లు కిరాయికి తెచ్చిన. ఒకదానికి రూ.25 కిరాయి పడుతుంది. రోజుకు 12 కవర్లు వాడడంతో వాటి కిరాయి రోజుకు రూ.300 పడుతుంది. ఇప్పటికే ఇరవై రోజులు గడవడంతో రూ.6 వేలు అయ్యాయి. ఇంకా ఎన్ని రోజులు అవుతుందో కూడా తెలియడం లేదు. ఇప్పుడు కనీసం ఎల్లిన వడ్లకు అయినా పైసలు వస్తాయో లేదో అని భయమేస్తుంది. వడ్ల పైసలు రావడం ఏమో కాని టార్పాలిన్ కవర్లకు కిరాయి చెల్లించడమే భారమవుతుంది.

– రాజయ్య, రైతు, బీబీపేట

కోర్టు కేసులో ఉన్న వ్యవసాయ భూమి పరిశీలన



చిల్లర్గిలో భూమిని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

పిట్లం(జుక్కల్): చిల్లర్గి గ్రామాన్ని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె గ్రామంలో 267 సర్వే నంబర్‌కు చెందిన వ్యవసాయ భూమి కోర్టు కేసులో ఉండడంతో ఆ భూమిని పరిశీలించారు. కోర్టులో దరఖాస్తు చేసిన రైతుతో పాటు ఇతర రైతులు, గ్రామస్తులతో మాట్లాడి భూమికు సంబంధించిన వివరాలు సేకరించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు సబ్ కలెక్టర్ పేర్కొన్నారు. పిట్లం తహసీల్దార్ వేణుగోపాల్, రెవెన్యూ సిబ్బంది తదితరులున్నారు.

తహసీల్ కార్యాలయంలో రికార్డుల పరిశీలన

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో రికార్డులను బుధవారం సబ్ కలెక్టర్ కిరణ్మయి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తహసీల్ కార్యాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని, పనిపై కార్యాలయానికి వచ్చే ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని సూచించారు. ఉప తహసీల్దార్ సత్యనారాయణ, ఆర్ఐ సీతల్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



కామారెడ్డి టౌన్: పట్టణ ప్రజలు వారి ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ అన్నారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని 20వ వార్డులో పర్యటించారు. మురికి కాలువలు, రోడ్లు శుభ్రంగా ఉంచాలని సానిటేషన్ సిబ్బందికి సూచించారు. ప్రతి ఇంటి ముందు మొక్కలను నాటి వాటి సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సలీం, కాలనీవాసులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేయొద్దు



కామారెడ్డి అర్బన్: బాల్య వివాహాలు చేయవద్దని సాధన స్వచ్ఛంద సంస్థ సభ్యులు బుధవారం రాత్రి పట్టణ పరిధిలోని దేవునిపల్లి డబుల్ బెడ్‌రూంల కాలనీ వద్ద కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి కాలనీవాసులకు అవగాహన కల్పించారు. 'చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ భారత్' నినాదంతో మురికివాడలు, గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నామని సంస్థ డైరెక్టర్ మురళీ మోహన్ తెలిపారు. కార్యక్రమంలో విశ్వజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పొరపాట్లు లేకుండా డాటా ఎంట్రీ పూర్తి చేయాలి



డాటా ఎంట్రీని పరిశీలిస్తున్న ఎంపీడీవో ప్రవీణ్



నాగిరెడ్డిపేటలో.. ఎంపీడీవో ప్రభాకరచారి

దోమకొండ: ఎలాంటి పొరపాట్లు లేకుండా డాటా ఎంట్రీ పూర్తి చేయాలని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ అన్నారు. బుధవారం భిక్కనూరు మండలం బీటీఎస్ చౌరస్తా వద్ద సౌత్ క్యాంపస్‌లో జరుగుతున్న డాటా ఎంట్రీ పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఆయన వెంట మండల పరిషత్ సిబ్బంది శ్రీకాంత్, ప్రశాంత్, వెంకటేష్ తదితరులున్నారు.

నాగిరెడ్డిపేటలో 30 శాతం డాటా ఎంట్రీ పూర్తి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): సర్వేకు సంబంధించి నాగిరెడ్డిపేట మండలంలో 30 శాతం డాటా ఎంట్రీ పూర్తయినట్లు స్థానిక ఎంపీడీవో ప్రభాకర్ చారి తెలిపారు. మండలకేంద్రంలో కొనసాగుతున్న డాటా ఎంట్రీ ప్రక్రియను బుధవారం ఆయన పరిశీలించారు. మండలంలో మొత్తం 10,548 కుటుంబాలకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉండగా 3,100 కుటుంబాల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారని ఆయన చెప్పారు.

ధైర్యంగా పోరాడి విజయం సాధించాలి



మాట్లాడుతున్న మోటివేషనల్ స్పీకర్ రమేశ్

రాజంపేట: ప్రతి ఒక్కరూ జీవితంలో కష్టాలు, సవాళ్లను అధిగమించి ధైర్యంగా ముందుకు వెళ్లి విజేతలుగా నిలిచి నలుగురికి ఆదర్శంగా ఉండాలని ఇంపాక్ట్ సర్టిఫైడ్ ట్రైనర్, స్పీకర్ రమేష్ చైతన్య అన్నారు. బుధవారం రాజంపేట కస్తూర్బా గాంధీ విద్యాలయంలో విద్యార్థులనుద్దేశించి జీవితంలో లక్ష్యాలు, సవాళ్ల అనే అంశంపై ఆయన మాట్లాడారు. సమస్యలనేవి ప్రతి ఒక్కరికి ఉంటాయని కానీ అవి మనం ఎలా స్వీకరిస్తాం అనే దాని పైన మన విజయం ఆధారపడి ఉంటుందన్నారు. అంతేగాని భయపడి ఆత్మహత్యలకు పాల్పడితే ఇటు కన్నవారికి అటు సమాజానికి తీరని నష్టం జరుగుతుందని సూచించారు. రెండు చేతులు, కాళ్లు లేకపోయినా నిక్ వూజిసిక్ ఎన్నో అవమానాలు కష్టాలను దాటుకొని ఇప్పుడు ప్రపంచంలో ఒక బెస్ట్ మోటివేషనల్ స్పీకర్‌గా ఉండడంతో పాటు, స్విమ్మింగ్, గోల్ఫ్, బ్యాడ్మింటన్‌లో కూడా ప్రావీణ్యం సంపాదించాడని ఉదాహరించారు. అలాగే చిన్నతనంలోనే పోలియో వచ్చి ఆరు సంవత్సరాల వరకు లేవలేనటువంటి స్థితిలో ఉన్న విల్మా గ్లోడియం రూడాల్ఫ్ అనే మహిళ ప్రపంచంలోనే వేగవంతమైన పరుగుల రాణిగా ఒలింపిక్స్‌లో నాలుగు బంగారు పతకాలు సాధించి చరిత్ర సృష్టించిందని గుర్తు చేశారు. ప్రత్యేక అధికారిణి శ్రీవాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలి



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని ఐఏఎస్ఆర్‌డీ స్వచ్ఛంద సంస్థ సమన్వయకర్త సోలంకి రవళి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అంతర్జాతీయ స్త్రీ హింస వ్యతిరేక దినోత్సవంలో భాగంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. దేశవ్యాప్తంగా ప్రతి 10 నిమిషాలకు ఒకరిపై హింస జరుగుతోందన్నారు. మహిళలపై హింస, దాడులు జరిగితే 181కు కాల్ చేసి సహాయం పొందవచ్చన్నారు. ప్రిన్సిపాల్ అజ్మల్ ఖాన్, విఠల్ రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలి



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని డీఆర్‌డీవో సురేందర్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో ఏర్పాటు చేసిన మండల సమాఖ్య సమావేశానికి హాజరై మాట్లాడారు. పద్మాజీవాడి గ్రామంలో నాప్కిన్స్ తయారీ విధానం, మదర్ ఫౌల్ట్రీ, అలాగే మోడెగాంలో గానుగ ద్వారా నూనె తయారీ విధానాన్ని పరిశీలించారు. అనంతరం రైతువేదిక భవనంలో జరిగిన సమావేశానికి హాజరయ్యారు. మహిళలు వ్యవసాయ రంగంలో కూడా అభివృద్ధిని సాధించాలన్నారు. కార్యక్రమంలో డీపీఎం వకుల, ఏపీఎం రాజిరెడ్డి, మండల సమాఖ్య అధ్యక్షురాలు డోకూరి శోభ, సీసీలు గౌరై రాములు, అంజనేయులు, లింగం, నరేందర్ రెడ్డి, సౌజన్య, అకౌంటెంట్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరించి పేస్కేలు అమలు చేయాలి



లింగంపేట(ఎల్లారెడ్డి): తెలంగాణ రాష్ట్ర సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం పిలుపు మేరకు బుధవారం నల్ల బ్యాడ్జీలు ధరించి స్థానిక ఎస్ఎస్ఏ ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా లింగంపేట మండల కేంద్రంలో జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడారు. సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించి తక్షణమే పేస్కేలు అమలు చేయాలని డిమాండు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం కావస్తున్నా నేటికీ హామీని నెరవేర్చలేదన్నారు. డిమాండ్లు నెరవేర్చకపోతే డిసెంబర్ మొదటి వారంలో సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు స్వప్న, రాజు, విజయ్‌కుమార్, రాజు, సంతోష్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

దీక్ష దివస్‌ను దిగ్విజయం చేయాలి



నిజాంసాగర్(జుక్కల్): జిల్లా కేంద్రంలో ఈనెల 29న బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించతలపెట్టిన దీక్షా–దివస్ కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని బీఆర్ఎస్ పార్టీ ఉమ్మడి మండల అధ్యక్షుడు సాధువుల సత్యనారాయణ కోరారు. బుధవారం మహమ్మద్ నగర్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశానుసారం జిల్లా కేంద్రంలో దీక్ష దివాస్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. దీక్ష దివస్ జిల్లా ఇన్‌చార్జి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో జరుగుతున్న దిక్షా దివాస్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు. సొసైటీ చైర్మన్ వాజిద్, మాజీ సీడీసీ చైర్మన్ గంగారెడ్డి, మాజీ సర్పంచులు లింగాల రామచందర్, లక్ష్మీనారాయణ, చందర్, రామాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్‌ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ కొనసాగుతుంది. మంగళవారం నాటికి 42 వేల 742 టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు తెలిపారు.

శనగ పంటల పరిశీలన



రాజంపేటలో శనగ పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

రాజంపేట: రాజంపేటలో శనగ పంటలను బుధవారం మండల వ్యవసాయ అధికారిణి శృతి పరిశీలించారు. ఇందులో భాగంగా యాసంగి శనగ పంటలో పూత, కాయ దశలో శనగ పచ్చ పురుగు ఉధృతి ఉన్నట్లు గుర్తించామన్నారు. పురుగు నివారణకు పలు సూచనలు, సలహాలిచ్చారు. రాజంపేట ఏఈవో శిల్ప, రైతు రమేశ్ పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి



దోమకొండ: విద్యార్థినులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని మండల ప్రత్యేకాధికారి జ్యోతి, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ సూచించారు. బుధవారం సీతారాంపల్లి కస్తూర్బా పాఠశాలను వారు పరిశీలించారు. పాఠశాలలో అన్ని వసతులు సక్రమంగా ఉన్నాయా లేదా అని పరిశీలించారు. పాఠశాలలో ఎలాంటి గొడవలు లేకుండా చూడాలన్నారు. ఉపాధ్యాయులు, సిబ్బంది ఈ విషయంలో సమన్వయంతో పనిచేయాలన్నారు. ఎంఈవో విజయ్‌కుమార్, కస్తూర్బా ఎస్‌వో మంగమ్మ, ఉపాధ్యాయులు ఉన్నారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు



బాన్సువాడ/బాన్సువాడరూరల్: నిజామాబాద్ జిల్లా కేంద్రంలో న్యాయవాదిపై దాడి చేసిన దుండగుల్ని కఠినంగా శిక్షించాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణమూర్తి అన్నారు. బుధవారం బాన్సువాడ కోర్టులో న్యాయవాదులు విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. న్యాయవాదులపై దాడులకు పాల్పడే వారిపై కఠిన చట్టాలు తీసుకొచ్చి న్యాయవాదులను రక్షించాలన్నారు. న్యాయవాదులు లక్ష్మారెడ్డి, మోహన్‌రెడ్డి, ఖలీల్, హమీద్, రమాకాంత్, మొగులయ్య, రాంరెడ్డి, ఆనంద్ తదితరులున్నారు.

రోడ్డా లేక మురికి కాలువా?



గాయత్రి నగర్‌లో రోడ్డుపైకి చేరిన మురికి నీరు

కామారెడ్డి అర్బన్: పట్టణ పరిధిలోని దేవునిపల్లి గాయత్రి నగర్‌లో మురికికాల్వలు లేక నీరంతా రోడ్లపైకి చేరి ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే మురికి కాల్వలు నిర్మించాలని కాలనీవాసులు కోరుతున్నారు. కాలనీ ఏర్పడి 20 సంవత్సరాలు అవుతున్నా మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రజాప్రతినిధులు విఫలమయ్యారని ఆరోపించారు. దేవునిపల్లి గ్రామపంచాయతీ నుంచి కామారెడ్డి మున్సిపల్ పరిధిలోకి వెళ్లినా ఆశించిన విధంగా అభివృద్ధి పనులు చేయడం లేదని అన్నారు.

క్లుప్తంగా

ఆలయ అభివృద్ధికి విరాళాలు



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని మత్తడి పోచమ్మ ఆలయం అభివృద్ధి కోసం బుధవారం జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ సంపత్‌గౌడ్ రూ.2.11లక్షలపై ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు దూరిశెట్టి అశోక్ మాట్లాడారు. అయిలాపూర్ గ్రామానికి చెందిన బెజుగం దేవేందర్ రూ.11, 000, లింగంపేటకు చెందిన భారత్ గ్యాస్ నిర్వాహకుడు అంజద్ హుస్సేన్ రూ. 11,000, చాకలి సాయిలు రూ.11,011, ఆవుల మనోహర్ రూ.11 వేలు అందజేసినట్లు తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



తాడ్వాయి(ఎల్లారెడ్డి): ఎండ్రియాల్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఉపాధ్యాయులు బాధితురాలికి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. పాఠశాలలో పీటీఎఫ్(అటెండర్)గా పనిచేస్తున్న రమణయ్య ఈ నెల 21న గుండెపోటుతో మృతిచెందాడు. ఆయన సేవలను గుర్తించి విద్యాశాఖ ఆయనకు ఆర్థిక సహాయాన్ని చేద్దామనే భావనతో ఉపాధ్యాలందరూ కలసి రూ.33 వేలు ఆర్థిక సహాయాన్ని మృతుడి భార్యకు అందజేశారు. హెచ్ఎంలు సంగారెడ్డి, కల్యాణి, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి, ఉపాధ్యాయులు రాజాగౌడ్, నర్సారెడ్డి, రాజులు, భాగ్యమ్మ, రాజశేఖర్ పాల్గొన్నారు.

సిద్దరామేశ్వరాలయం అభివృద్ధికి రూ.51వేల విరాళం



భిక్కనూరు: భిక్కనూరు సిద్దరామేశ్వరాలయం అభివృద్ధికి హైదరాబాద్‌లోని కొంపల్లికి చెందిన మోటూరి సాయిబాబా–రజిత దంపతులు బుధవారం రూ.51వేల 100ను విరాళంగా అందజేశారు. ఆలయ అర్చకుడు కొడకండ్ల రామగిరిశర్మ, దాత కుటుంబీకులకు శేషవస్త్రాన్ని, ప్రసాదాలను అందజేశారు.

ఎస్సైగా శివకుమార్



నిజాంసాగర్(జుక్కల్): నిజాంసాగర్ ఎస్సైగా శివకుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సిరిసిల్ల జిల్లా గంభీర్‌రావుపేట ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న శివకుమార్, నిజాంసాగర్ ఎస్సైగా బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎస్సై సుధాకర్ లింగంపేట ఎస్సైగా బదిలీపై వెళ్లారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు నేరాలు, దొంగతనాల నియంత్రణకు కృషి చేస్తానని ఎస్సై శివకుమార్ తెలిపారు.

27వ సారి రక్తదానం



కామారెడ్డి అర్బన్: రక్తహీనతతో బాధపడుతున్న వృద్ధురాలికి బి–పాజిటివ్ రక్తం అవసరం కావడంతో రెడ్‌క్రాస్ సొసైటీ డివిజన్ కార్యదర్శి, ప్రభుత్వ ఉపాధ్యాయుడు జమీల్ బుధవారం 27వ సారి రక్తదానం చేశారు. ఉపాధ్యాయుడిగా విధులతో పాటు సేవా భావంతో రెడ్‌క్రాస్ సొసైటీలో కొనసాగుతూ రక్తదానాలు చేయడం పట్ల జమీల్‌ను రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు ఎం.రాజన్న, సమన్వయకర్త డాక్టర్ బాలు, కామారెడ్డి రక్తదాతల సమూహం ఉపాధ్యక్షుడు పుట్ల అనిల్‌కుమార్, తదితరులు అభినందించారు.

పాడిపశువుల పెంపకంపై దృష్టిసారించాలి



భిక్కనూరు: రైతులు పాడిపశువుల పెంపకంపై దృష్టిసారించాలని పశువైద్యాధికారి అనిల్‌రెడ్డి అన్నారు. మోటాట్‌పల్లిలో బుధవారం నిర్వహించిన పశువైద్య శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులు పాడి పశువుల పెంపకం వల్ల ఆర్థికంగా బలపడే అవకాశం ఉందన్నారు. రైతులు తమ పశువులకు ఏదైనా ఇబ్బంది కలిగితే వెంటనే పశుసంవర్ధక శాఖ అధికారులకు తెలిపితే వారు వచ్చి వైద్యం అందజేస్తారన్నా రు. పశువులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వాటికి చికిత్స చేశారు. వైద్యుడు అబ్దుల్, రమేశ్, సూపర్‌వైజర్ కృష్ణ, గోపాల మిత్రలు సురేష్, భరత్, నందీప్‌లు పాల్గొన్నారు.

సంక్షిప్తం

ఏఎంసీ చైర్మన్ పదవీ స్వీకార కార్యక్రమానికి రావాలి

నస్రుల్లాబాద్(బాన్సువాడ): బీర్కూర్ మార్కెట్ కమిటీ పదవీ ప్రమాణ స్వీకరణ కార్యక్రమానికి బాన్సువాడ నియోజకవర్గంలోని అన్ని మండలాల నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఏఎంసీ మాజీ చైర్మన్ పెర్క శ్రీనివాస్ కోరారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. శుక్రవారం జరిగే ఈ కార్యక్రమానికి వ్యవసాయ సలహాదారులు పోచారం శ్రీనివాస్ రెడ్డి హాజరవుతున్నారన్నారు. ఏఎంసీ చైర్‌పర్సన్ దుర్గం శ్యామల, మాజీ జెడ్పీ కో–ఆప్షన్ మాజిద్ ఖాన్, మాజీ ఎంపీటీసీ కంది మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

విత్తన శుద్ధి తప్పనిసరి

నిజాంసాగర్(జుక్కల్): యాసంగి పంటల సాగుకు సమాయత్తం అవుతున్న రైతులు విత్తనాలు ఎంపికతో పాటు విత్తన శుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలని మహమ్మద్‌నగర్ ఏవో నవ్య సూచించారు. బుధవారం మహమ్మద్‌నగర్ మండలం సింగితం జీపీలో యాసంగి పంటల సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. వానాకాలం పంట నూర్పిళ్లు పూర్తయిన తర్వాత వరి కొయ్యలకు నిప్పు పెట్టవద్దన్నారు. నాయకులు తాటిపల్లి. సరస్వతిగౌడ్, రఫీ, సిద్దిరాములు, మన్నెనారాయణ, మైపాల్‌రెడ్డి తదితరులున్నారు.

మాలల సింహగర్జన కరపత్రాల ఆవిష్కరణ

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): హైదరాబాద్‌లోని పరేడ్‌గ్రౌండ్‌లో డిసెంబర్ 1న నిర్వహించనున్న మాలల సింహగర్జనకు సంబంధించిన కరపత్రాలను ఎల్లారెడ్డిలో బుధవారం జిల్లా మాల సంఘం ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. జిలా మాల సంఘం యువజన అధ్యక్షుడు జువ్వాడి వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సభను విజయవంతం చేయాలి



భిక్కనూరు: మాలల సింహగర్జన సభకు జిల్లాలోని మాలలందరూ తరలి వచ్చి విజయవంతం చేయాలని జిల్లా మాలల సంఘం ప్రధాన కార్యదర్శి నర్మల రాంచంద్రం ఓ ప్రకటనలో కోరారు. ఏబీసీడీ వర్గీకరణతో మాలలకు తీవ్ర అన్యాయం జరగుతుందని దీన్ని అడ్డుకునేందుకు మాలల సింహగర్జనను నిర్వహిస్తున్నారని, వర్గీకరణను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు.

బాన్సువాడ రూరల్: మాలల సింహగర్జనను విజయవంతం చేయాలని ఆలిండియా అంబేడ్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బంగారు మైసయ్య కోరారు. బుధవారం ఆయన మాలమహానాడు నాయకులు నెర్రె నర్సింలు, గైని రవి, తదితరులతో కలిసి నాగారం గ్రామంలో పర్యటించారు. నేతలు కొత్తాబాది సాయిలు, శివయ్య, కొత్తపల్లి సాయిలు, మన్నె గంగారాం, సంగయ్య, భూమయ్య తదితరులున్నారు.

సబ్ మార్కెట్‌కు స్థలం కేటాయించాలి

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్ మండలంలో సబ్ మార్కెట్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని బుధవారం బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయిని పిట్లం మార్కెట్ కమిటీ చైర్మన్ చీకోటి మనోజ్ పటేల్ కోరారు. స్థలం కేటాయించడంతో పాటు మార్కెట్‌కు అప్పగించాలన్నారు. అలాగే పిట్లం మండల కేంద్రంలోని డబుల్ బెడ్రూం ఇళ్లకు నంబర్లు కేటాయించాలని కోరారు. మహమ్మద్ నగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు అడ్వొకేట్ రాంరెడ్డి, గుర్రపు శ్రీనివాస్ పటేల్ ఉన్నారు.